క్లుప్తంగా

ముగిసిన ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవం



పుష్కరిణి నీటితో చక్రతీర్థ స్నానాలు చేస్తున్న అర్చకులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. చైత్రశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఉషా పద్మిని ఛాయాదేవేరులతో సూర్యనారాయణ స్వామి వారి కల్యాణమూర్తులను శనివారం ఉదయం తిరువీధిగా తీసుకొచ్చి ఇంద్రపుష్కరిణిలో చక్రతీర్థ స్నానాల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో సుమంగళి అర్చన, నీలమణి ధారణ, నాకబలి ప్రయుక్త చక్రతీర్థ స్నానాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణ మహోత్సవాల ముగింపుగా ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాలు సిద్ధం చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రతినిధి నేతింటి మీన అన్నారు. ఎచ్చెర్లలో నవధాన్యాల ప్రాధాన్యత, సాగు, ప్రయోజనాలను రైతులకు శనివారం వివరించారు. ఖరీఫ్‌లో ప్రధాన పంటకు ముందు భూసారం కోసం నవధాన్యాలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు

అధ్యక్షురాలిగా గీతాశ్రీకాంత్



కోవే నూతన కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్: కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఇండియా(కోవే) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షురాలిగా డా.యార్లగడ్డ గీతా శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో కొత్త కార్యవర్గంతో జాతీయ కార్యదర్శి అపర్ణ, జాతీయ సహాయ కార్యదర్శి రాధికాలు శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర జౌళి మరియు చేనేత శాఖ కమిషనర్ రేఖా రాణి మాట్లాడుతూ మహిళా సాధికారత, వ్యాపార అభివృద్ధికి కోవే చేస్తున్న నిరంతర కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా ఎంఎస్‌ఎంఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుదర్శన్ బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్, నాబార్డ్ మురారి మోహన్ బెహరా, ఏపీ చాంబర్ ప్రెసిడెంట్ పోట్లూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ముద్దాడ బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. ఈ మేరకు గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని కోరారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తమ్మినేని నారాయణ రావు, కె.కొండయ్య, భవానీ పాల్గొన్నారు.

14న సైనిక భవనానికి శంకుస్థాపన



సైనిక్ భవన స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు పంచాయతీలో ఇంటిగ్రేటెడ్ సైనిక భవనానికి ఈనెల 14న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా మాజీ సైనిక అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు తెలిపారు. శనివారం పలువురు మాజీ సైనికులతో కలిసి స్థలాన్ని పరిశీలించి చదును చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ సైనిక భవనం నిర్మాణం జరిగితే సైనికుల అవసరాలన్నీ ఒకేచోట తీర్చుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

సాగునీరు అందేనా..?




కాలువ పరిస్థితి



శిథిలావస్థలో ప్రాజెక్టు నిర్మాణాలు



హెడ్ రెగ్యులేటర్ పరిస్థితి



నీటినిల్వ ప్రాంతంలో ఇసుకమేటలతో పూడుకుపోయిన దృశ్యం

- భయపెడుతున్న నారాయణపురం కుడి కాలువ
- గత ఖరీఫ్‌లో సాగునీరు అందని వైనం
- ఈ ఏడాదిపై రైతుల ఆందోళన

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని రైతులకు సాగునీటి సమస్య వేధిస్తోంది. ప్రధానంగా నారాయణపురం కుడికాలువ కింద సాగునీరు అందకపోడంతో గత ఖరీఫ్‌లో సుమారు 5,000 ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోయారు. కాగా ఈ ఏడాది ఖరీఫ్‌కు ఇంకా రెండు నెలల సమయం ఉంది. అయితే రానున్న ఖరీఫ్‌కు సజావుగా సాగునీరు అందజేయాలంటే అధికారులు ఇప్పటినుంచే ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నారాయణపురం కుడి కాలువ మొత్తం మూడు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి మండలంలో 4,221, ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరు మండలంలో 6,967, ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల మండలంలో 7,175 ఎకరాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. అందువలన అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎచ్చెర్ల మండలంలో...

ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట నుంచి భగీరథపురం వరకు ఈ సాగునీటి కాలువ విస్తరించి ఉంది. కుశాలపురం, ఇబ్రహీంబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, తోటపాలేం, పొన్నాడ, కొత్తపేట, కొంగరాం, ముద్దాడ, ధర్మవరం, బొంతలకోడూరు ఇలా 13 పంచాయతీల రైతులు దీనిపైనే సాగునీటి కోసం ఆధారపడి ఉన్నారు. గత ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పంటలు చేతికందని పరిస్థితి నెలకొంది. ఆయకట్టు హెడ్ రెగ్యులేషన్ సిస్టం సక్రమంగా లేదు. కాంక్రీట్ లైన్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

ఆయకట్టు ప్రారంభంలో ఇసుకమేటల తొలగింపు సైతం జరగలేదు. షట్టర్లు సక్రమంగా లేకపోవడం వలన ప్రారంభంలో నీరు వృథాగా పోతోంది. సాగునీరు శివారుకు అందజేయడంలో కీలకమైన లష్కర్ వ్యవస్థ లేదు. కనీసం ఖరీఫ్ సీజన్‌కు పని చేసే కాంట్రక్టు సంస్థనైనా ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుంది. యంత్రాలతో కాలువలో పూడికలు తీయడం, కాలువలో జంగిల్ క్లియరెన్స్, అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు వంటివి చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆయకట్టు బాట నిర్వహించాం



ప్రాజెక్టు ప్రారంభం నుంచి కాలువ శివారు వరకు రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆయకట్టు బాట ఇటీవల నిర్వహించాం. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లాం. రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పరిస్థితి చూస్తే ఆవేదన కలిగిస్తోంది. మూడు నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– సనపల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

మరమ్మతులు చేపట్టాలి



ప్రాజెక్టు ప్రారంభం నుంచి కాలువ శివారు వరకు ప్రత్యేక దృష్టిపెట్టి మరమ్మతులు చేపట్టాలి. గత ఖరీఫ్‌లో రైతులు పంటలు కోల్పోయారు. వ్యవసాయం మీద ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే ఈ ఏడాది సైతం ఖరీఫ్ గట్టెక్కడం కష్టంగా మారుతుంది

– పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు

చర్యలు తీసుకుంటాం

ఖరీఫ్‌లో సాగునీటి సమస్య లేకుండా సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటాం. హెడ్ రెగ్యులేటర్ మరమ్మతులు, సీల్ట్ తొలగింపు వంటి చర్యలు చేపడతాం. ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై ప్రత్యేక దృష్టి పెడతాం.

– వై.రవీంద్రనాయుడు, డీఈ, నారాయణపురం ఆనకట్టు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



పురస్కారాలు అందుకున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని వక్తలు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో తరిణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా సాధికారత మహోత్సవం–2025 శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జువైనల్ బోర్డు సభ్యురాలు శ్రీదేవి హస్త కళా ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం మండ జగదాంబపై రూపొందించిన డాక్యుమెంటరీని గొండు స్వాతి ఆవిష్కరించారు. అలాగే తరిణి కృష్ణ యూట్యూబ్ ఛానల్ సైతం ప్రారంభించారు. ఐసీడీఎస్ మహిళా సాధికారత అధికారి శాంతిశ్రీ మాట్లాడుతూ మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మండ శ్రీనివాసరావు, పి.మాలతి, పి.సుధీర, సత్తారు స్రవంతి, కణుగుల సహజ, పైడి సింధూర, కె.నాగమణి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌లో విద్యార్థులకు పలు ప్రతిభా పోటీలు శనివారం నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా వ్యాస రచన, క్విజ్ పోటీలు చేపట్టారు. పోటీలను పరిపాలన అధికారి మునిరామకృష్ణ పర్యవేక్షించారు. ఈ పోటీల్లో 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ ప్రారంభించారు.

విద్యార్థులు ధైర్యం కోల్పోవద్దు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):



మాట్లాడుతున్న బోర గోపి

పరీక్షల ఫలితాలతో విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి సూచించారు. నగరంలోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం పరీక్షలు మాత్రమేనని జీవితాన్ని నిర్ణయించవనే విషయాన్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో భార్గవ నాయుడు, జై.ప్రకాష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు



తమ కళాశాల టాపర్‌ను అభినందిస్తున్న నారాయణ కళాశాల ప్రతినిధులు

విద్యార్థుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీకాకుళం నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు జోరు కనబర్చారు. శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పూర్తి హవా కనబర్చారు. జిల్లా టాపర్లతో పాటు టాప్ ర్యాంకులన్నీ శ్రీచైతన్య విద్యార్థులు కైవసం చేసుకున్నారని ఆ విద్యాసంస్థల ఏజీఎం నర్సునాయుడు, డీన్ కె.మురళీధర్ సంతోషం వ్యక్తం చేశారు. అఖండమైన ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఫలితాల్లో హవా..

ఇంటర్ ఫలితాల్లో శ్రీకాకుళం నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు హవా కనబర్చారని డీజీఎం డి.హనుమంతరావు, డీఎన్ మణికుమార్, ఏజీఎం బి.తిరుపతిరావు, కె.గంగాధర్, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీధర్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం కళాశాలలో వారంతా శుభాకాంక్షలు తెలిపారు.

జయభేరి

శ్రీకాకుళం నగరంలోని శ్రీసాయికృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో జయభేరి మోగించారని కరస్పాండెంట్ ధర్మాన రఘునాథ్‌మూర్తి, ప్రిన్సిపాల్ జి.సత్యంనాయుడు ప్రసంశించారు. కళాశాల నుంచి ఎంఈసీ గ్రూపులో జీవీఎస్ కృష్ణప్రవల్లిక 978 మార్కులు, ఎంపీసీలో పొట్నూరు దీక్షిత 972, వి.తిరుపతి 971, హెచ్‌ఈసీలో జీవీఎస్ దర్శిణి 957, మొదటి సంవత్సరంలో విద్యార్థుల్లో ఎ.తేజేశ్వరి ఎంపీసీలో 456, ఆర్ట్స్‌లో ఎస్.సాయిఅక్షయ 467 మార్కులతో సత్తా చాటారని కొనియాడారు.

అదుర్స్



వి.వినీలాకుమారి



పెడి ఐశ్వర్య

గూనపాలెంలో ఉన్న శాంతి నికేతన్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అదుర్స్ అనిపించేలా ఫలితాలు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్లు కొర్ను పావని, కొర్ను నాగార్జునప్రతాప్, ప్రిన్సిపాల్ ఎన్.అప్పలస్వామి సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీసీలో పాలవలస భవాని 980 మార్కులతో పాటు 900 మార్కులు పైబడి 30 మంది విద్యార్థులు సాధించారన్నారు. అలాగే ఫస్టియర్‌లో మువ్వల యశ్వంత్ 460, బైపీసీలో ఆర్.రాజు 426 మార్కులతో విజయబావుటా ఎగురవేశారని ప్రశంసించారు.

ఎచ్చెర్ల క్యాంపస్



కె.పూజిత



బి.హరిత

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ కేజీబీవీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.పూజిత ఎంపీసీలో 975 మార్కులు సాధించింది. అలాగే ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకులం విద్యార్థిని బి.హరిత ఎంపీసీలో 969 మార్కులు సాధించింది. ఇద్దరివీ వ్యవసాయ కుటుంబాలు కావడం విశేషం.

రణస్థలంలో..



డి.జయలక్ష్మి



పి.రజిని



ఎ.పార్వతి



ఎన్.ఢిల్లీశ్వరి



లంక యమున



సూరాడ జ్యోతి



సుఫియా షాహీన్



సీహెచ్ చర్మిషా



కె.స్వాతి



ఎస్.దివ్య

రణస్థలం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రణస్థలం ఆదర్శ పాఠశాలలోని విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. మొదటి సంవత్సరం బైపీసీలో గొర్లె మోహిని 428, వంక భాను 426, ఎంపీసీలో సుఫియా షాహీన్ 463, చరిష్మా 458 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్.దివ్య 967, బైపీసీలో ఎల్.పల్లవి 967, అనుశ్రీ 966 మార్కులతో సత్తాచాటారు. అలాగే లంకపేట కేజీబీవీలో మొదటి సంవత్సరంలో ఎంపీసీలో దల్లి జయలక్ష్మి 442, పొట్నూరు రజిని 439, పల్ల పార్వతి 439, నాయన ఢిల్లీశ్వరి 436, ఈసల నిహారిక 423, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో లంక యమున 911, సూరాడ జ్యోతి 907 మార్కులు సాధించారు. విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కేజీబీవీలో.. 90 శాతం ఉత్తీర్ణత

ఎచ్చెర్ల: ఇంటర్మీడియట్ ఫలితాల్లో లావేరు మండలంలో మురపాక గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 92 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ప్రథమ సంవత్సరంలో 39 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 36 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో ఎ.సాయిదుర్గ అనే విద్యార్థిని 444 మార్కులను సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 36 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 31 మంది ఉత్తీర్ణత సాధించారు. సీహెచ్ హేమలత 884 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది.

శతశాతం ఉత్తీర్ణత



బి.యువబాలాజీ



జె.విజయ్



జె.వినయ్‌కుమార్



టి.సాయిసందీప్‌కుమార్

జి.సిగడాం: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్ష ఫలితాల్లో జి.సిగడాం విద్యార్థులు సత్తాచాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 89 విద్యార్థులకు గానూ, 89 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 94 మంది పరీక్షకు హాజరవ్వగా, 89 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక తెలిపారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మొదటి ఏడాదిలో 68 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా, శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 58 మందికి గానూ 51 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ మొదటి ఏడాదిలో బొడ్డేపల్లి యువబాలాజీ 449 మార్కులు సాధించాడు. బైపీసీ మొదటి ఏడాదిలో జె.విజయ్ 430 మార్కులు సాధించాడు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జె.వినయ్‌కుమార్ 969 మార్కులు, బైపీసీలో టి.సాయిసందీప్‌కుమార్ 947 మార్కులు సాధించాడు.

కూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు జడ్జి

గార: శ్రీకూర్మం దేవాలయంలోని కూర్మనాథున్ని ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవికుమార్ శనివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు స్వాగతం పలికి స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం–మెట్టవలస కూడలి వద్ద సర్పంచ్‌లు కామొజుల సీతారాం, ధారబోయిన రెయిమ్మ, పలిశెట్టి సూర్యనారాయణ కె.వెంకట్ సీతారాం, బెవర జగన్నాథం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, నాయకులు కుమరాపు రవికుమార్, బూరాడ వెంకటరమణ, సర్పంచ్‌లు మీసాల రవికుమార్, బుడారి లక్ష్మణరావు, సాకేటి నాగరాజు, మానం పోలారావు, పలిశెట్టి సత్యారావు, వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ ఎంపురం పంచాయతీ లింగాలపేట గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎచ్చెర్ల మండల పరిషత్ అధ్యక్షుడు మొదలవలస చిరంజీవి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు పనులను చేపట్టాలని సిబ్బంది, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు కోన సూర్యారావు, నేతింటి సత్యనారాయణ, గణపతి ఉన్నారు.

ఈనెల 16న పాత వస్తువుల వేలం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఇనుము, కలప, ఇతర లోహాల పాత వస్తువులను ఈనెల 16వ తేదీన వేలం వేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గణస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ వేలంపాట ఉంటుందని చెప్పారు. రూ.5 వేలు ముందుగా అడ్వాన్స్ చెల్లించినవారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులుగా తెలిపారు. ప్రత్యేక కమిటీ వేలాన్ని పర్యవేక్షిస్తుందన్నారు.